క్లుప్తంగా

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

మద్దిలపాలెం: శివాజీపాలెం చిన పోలమాంబ అమ్మవారి పండగ సందర్భంగా పీతలవానిపాలేనికి చెందిన శ్రీకృష్ణా యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను యువజన సంఘం ప్రతినిధి పెసల శ్రీను ప్రారంభించారు. 12 జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నాయి.

రామకృష్ణాపురంలో రోడ్ల పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం కార్పొరేటర్ కెల్ల సునీత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.30 లక్షల నిధులతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. పనులను నాణ్యతతో చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ వర్క్స్ అధికారులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, వంకర బాబూరావు, కాకర గోవింద్, నందిత, తదితరులు పాల్గొన్నారు.

కోస్టల్ రీసెర్చ్ లేబొరేటరీ ప్రారంభం



ప్రయోగశాలను ప్రారంభిస్తున్న కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం జువాలజీ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన కోస్టల్ రీసెర్చ్ లేబొరేటరీని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, ఎన్‌సీసీఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ రమణమూర్తి, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఎన్‌సీసీఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ మిశ్ర, డాక్టర్ శివాజీ పాత్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రచారం



సుప్ర వాహనాల్లో గత ప్రమాదాలను చూస్తున్న ప్రజలు

మర్రిపాలెం: రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు సుప్ర వాహనాల ద్వారా ప్రచారం చేపట్టారు. ఈ నేపథ్యంలో మర్రిపాలెం జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించినట్టు ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం మర్రిపాలెం కూడలిలో గత ప్రమాదాలను ప్రదర్శిస్తూ జాగ్రత్తలు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే వచ్చే నష్టం ఎలా ఉంటుందో తెలిపారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

చిల్డ్రన్స్ ఎరీనా.. పెద్దలకు మాత్రమే.!

- ప్రారంభించి ఐదేళ్లు అవుతున్నా ఫంక్షన్లు, మీటింగ్‌లకే పరిమితం
- కానరాని చిన్నారుల వినోదం
- జాడలేని వేసవి శిక్షణ శిబిరాలు



వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనా

బీచ్ రోడ్డు: చిన్నారులకు వినోదం, విజ్ఞానం పంచేందుకు సిరిపురం కూడలిలో వీఎంఆర్‌డీఏ నిర్మించిన చిల్డ్రన్స్ ఎరీనా పెద్దలకు ఉపయోగపడుతోంది. ప్రైవేట్ ఫంక్షన్లు, మీటింగ్‌లకు పరిమితమవుతోంది. సుమారు రూ.12 కోట్లతో ఆధునికీకరించిన ఈ చిల్డ్రన్ ఎరీనాలో చిన్నారులకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. కేవలం పుట్టిన రోజు వేడుకలు, ఆఫ్ శారీ ఫంక్షన్లు, రాజకీయ పార్టీల సమావేశాలు, ఎన్జీవోల మీటింగ్‌లు, కాలేజీల వేడుకలకు ఈ ఎరీనాను వినియోగిస్తున్నారు. అందులో తప్పు ఏమీ లేదు. కానీ పిల్లలకు ఉద్దేశించిన ప్రాంగణం వారికి అందుబాటులో లేకుండా చేయడమే బాగోలేదు.

ఐదేళ్లలో ఐదు చిత్రాల ప్రదర్శన

చిల్డ్రన్ ఎరీనాను ఐదేళ్ల కిందట అప్పటి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈ ఎరీనాలో చిన్నారులకు వినోదం కలిగించే చిత్రాలను ప్రదర్శించాలని 4కే స్క్రీన్‌ను కూడా ఏర్పాటు చేశారు. అయితే ఈ ఐదేళ్లలో ఐదు చిత్రాలు మాత్రమే ప్రదర్శించడం విశేషం. ఇక విజ్ఞానం కోసం ఏర్పాటు చేయాల్సిన ఎగ్జిబిషన్స్, వర్క్‌షాపులు అయితే ఒక్కటి కూడా నిర్వహించిన దాఖలాలు లేవు.

- వేసవి సెలవుల్లో చిన్నారులకు వినోదంతో కూడిన విద్యను నేర్పించాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. అందుకు తగ్గట్టు వేసవి శిక్షణ శిబిరాలు పలు సంస్థలు నిర్వహిస్తుంటాయి. గతంలో చిల్డ్రన్ ఎరీనాలో కూడా నిర్వహించేవారు. అయితే చిల్డ్రన్ ఎరీనా పునః ప్రారంభించిన ఐదేళ్లలో ఒకే ఒక్కసారి వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ ఏడాది వేసవి సెలవుల్లో శిక్షణ శిబిరాల నిర్వహణపై ఇప్పటి వరకు వీఎంఆర్‌డీఏ ఎటువంటి ప్రకటన చేయలేదు.

చిల్డ్రన్స్ ఎరీనాపై నిర్లక్ష్యం తగదు



చిన్నారుల కోసం నిర్మించిన చిల్డ్రన్ ఎరీనాపై అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదు. కనీసం వేసవి కాలంలోనైనా చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశిస్తాం. మా కమిషన్ బాధ్యతలు చేపట్టిన మొదట్లో ఓ చిత్రాన్ని ప్రదర్శించాం. చిన్నారుల తల్లిదండ్రుల నుంచి కూడా స్పందన ఉండాలి. చిన్నారులను మొబైల్స్‌కే పరిమితం చేయకుండా ఇటువంటి చిల్డ్రన్ ఎరీనాకు తీసుకొచ్చి వినోదం, విజ్ఞానం పెంపొందేలా కృషి చేయాలి. వీఎంఆర్‌డీఏ తక్కువ ఫీజుతో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించాలి.

– గొండు సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

ప్రజా సంక్షేమానికి సీఎం జగన్ పెద్ద పీట



పాత వెంకోజీపాలెంలో పథకాల గురించి వివరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని

మద్దిలపాలెం: ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. జీవీఎంసీ 16వ వార్డు కొత్త వెంకోజీపాలెంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధి పొందిన పథకాల గురించి వివరించారు. సంక్షేమ ఫలాలు ఎంత మేరకు సద్వినియోగం చేసుకున్నారో ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందించారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు లభిస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. వీటిని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేసి చూపిస్తున్నారని చెప్పారు. ప్రతి ఇంటికి సంక్షేమ లబ్ధి చేకూరాలన్న లక్ష్యంతోనే సీఎం పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు చొల్లంగి నాగేశ్వరరావు, ఒమ్మి పోలరత్నం, మీసాల ప్రదీప్, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

23వ వార్డులో అభివృద్ధి పనులకు భూమి పూజ



పైపులైన్ పనులకు భూమిపూజ చేస్తున్న మేయర్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, కార్పొరేటర్

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.33 లక్షల నిధులతో తలపెట్టిన పైపులైన్ పనులకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల మంగళవారం శంకుస్థాపన చేశారు. చైతన్యనగర్ స్వామి ఫంక్షన్ హాల్ వద్ద కార్పొరేటర్ గుడ్ల విజయసాయితో కలిసి వారు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైతన్యనగర్, కేఆర్‌ఎం కాలనీలో మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కూడా పనులు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కార్పొరేటర్ గుడ్ల విజయసాయి మాట్లాడుతూ వార్డులో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి, ఈఈ సుధాకర్, రహీం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ధర్నాలో నినాదాలు చేస్తున్న ఏపీ జేఏసీ (అమరావతి) నాయకులు

మహారాణిపేట : కాంట్రాక్ట్ ఉద్యోగులు గత 20 సంవత్సరాలుగా రెగ్యులర్ కాకుండా ఉన్నారని ఏపీ ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం సంఘాల కార్యాచరణ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని ఎన్‌జీవో హోంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్, సిటీ కార్యదర్శి సత్యనారాయణ, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథరావు, అమరావతి కో చైర్మన్లు ఎ. శ్రీనివాసరావు, నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి మహేష్, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకుడు వి.వీరబ్రహ్మం, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఒంటిమెట్ట కోదండరాముడికి విశాఖ పుష్పాలు



పూలకు సంకల్పం చేస్తున్న వేద పండితులు

ఎంవీపీ కాలనీ: ఒంటిమెట్ట శ్రీకోదండరామస్వామి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలివెళ్లాయి. భక్తులు అందజేసిన కలువ, తామర పూలను ఈ మేరకు భక్తిశ్రద్ధలతో సంకల్పం చేసి ఒంటిమెట్ట పంపించారు. మంగళవారం వైదిక విజ్ఞాన విపంచి, విశాఖ కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో టీటీడీ ధర్మప్రచార ప్రచార పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భక్తుల నుంచి సేకరించిన కలువ, తామర పూలకు తొలుత వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి సంకల్పించారు. బుధవారం ఒంటిమెట్టలో జరగనున్న శ్రీకోదండ రాముడి పుష్పయాగంలో ఈ పూలను వినియోగించనున్నారు. కడప మీదుగా ఈ పూలు బుధవారం ఉదయానికి ఒంటిమెట్ట చేరుకుంటాయని ఆధ్యాత్మిక వేత్త హిమాంశు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైదిక విజ్ఞాన విపంచి అధ్యక్షుడు డాక్టర్ పైడి వెంకటరమణ, విశాఖ కార్తీక దీపోత్సవ కమిటీ అధ్యక్షుడు గ్రంధి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని రక్షించిన లైఫ్‌గార్డ్స్



సాయికుమార్‌ను రక్షించి తీసుకొస్తున్న లైఫ్‌గార్డ్స్

బీచ్ రోడ్డు: ఆర్కే బీచ్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడిని బీచ్ లైఫ్‌గార్డ్స్ రక్షించిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన వాసిరెడ్డి సంతోషకుమార్ ఆరోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకునే ఉద్దేశంతో సముద్రంలోకి వెళుతుండగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఎం.ధనరాజు, పి.రవివర్మ, వి.ఎర్నిరాజు అడ్డుకున్నారు. ఆయన ఒడ్డుకు తీసుకొచ్చి మహారాణిపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ అతనికి కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువకుడి ప్రాణాలు రక్షించిన లైఫ్‌గార్డ్‌లను సీపీ సీఎం త్రివిక్రమవర్మ అభినందించారు.

వైభవంగా శ్రీరామానుజ తిరు నక్షత్ర పూజ



ప్రత్యేక అలంకరణలో శ్రీరామానుజ స్వామి

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో కొలువైన శ్రీభగవత్ రామానుజ స్వామికి మంగళవారం తిరు నక్షత్రం పూజను వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



స్టాల్‌లో వస్తువులను పరిశీలిస్తున్న అధికారులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో మంగళవారం అధికారులతో కలిసి స్టేషన్ డైరెక్టర్ కె.వెంకటరాజు తనిఖీలు చేపట్టారు. అన్ని ప్లాట్‌ఫాంలలోని స్టాళ్లు, పరిసరాల పరిశుభ్రత, కేటరింగ్ సిబ్బంది పనితీరు, మంచినీటి కుళాయిలు, బెంచీలు, లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లను పరిశీలించారు. ఆయా ప్రదేశాల్లో ఉన్న పార్సిల్, కేటరింగ్ సామగ్రిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. స్టేషన్ మేనేజర్ ఎ.అరుణశ్రీ, గ్యారేజ్ అండ్ వేగన్, ఇంజనీరింగ్, కమర్షియల్, పబ్లిక్ హెల్త్, తదితర అధికారులు పాల్గొన్నారు.

బుల్లయ్య కళాశాలకు పతకాల పంట



విజేతలతో కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: ఈనెల 22, 23 తేదీల్లో ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బులయ్య కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. సబ్ జూనియర్ విభాగంలో బీఎస్సీ విద్యార్థి ఎస్.కుముందుని రజతపతకం, ఇంటర్ విద్యార్థి వి.జస్వంత్ బంగారు పతకం సాధించారు. జూనియర్ విభాగంలో ఎస్.జ్యోతి బంగారు, బి. అనిల్‌కుమార్ బంగారు, బి.లక్ష్మిసాయి రజతం, సీహెచ్ అజయ్ బంగారు పతకం సాధించారు. ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థి బి.అనిల్‌కుమార్ 83 కిలోల విభాగంలో ఆంధ్రప్రదేశ్ స్ట్రాంగ్ మెన్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విజేతలను కళాశాల కరస్పాండెంట్ జి. మధుకుమార్ అభినందించారు.

శ్రీశ్రీపై క్విజ్ పోటీలు



క్విజ్ పోటీలో పాల్గొన్న సాహితీవేత్తలు, యువత

సీతంపేట: శ్రీశ్రీ జయంతి సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి. రఘురామారావు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శ్రీశ్రీ జీవితం, సమగ్ర సాహిత్యంపై క్విజ్ పోటీ నిర్వహించారు. ఇందులో 25 మంది పాల్గొన్నారు. 50 ప్రశ్నలు, వంద మార్కులకు వన్ వర్డ్ ఆన్సర్స్ రూపంలో పరీక్ష జరిగింది. ఈ పోటీల విజేతలకు జూనియర్, సీనియర్ విభాగాలకు వేర్వేరుగా ఈనెల 30న అంకోశాలో జరగనున్న శ్రీశ్రీ జయంతి వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు. రెండు విభాగాలకు విడివిడిగా ప్రథమ బహుమతి రూ.1000, ద్వితీయ బహుమతి రూ.750 నగదు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ పోటీలను డాక్టర్ డీవీ సూర్యారావు, మేడా మస్తాన్‌రెడ్డి పర్యవేక్షించారు.

దోమల నివారణతో మలేరియాకు అడ్డుకట్ట



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆరిలోవ: ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా ఆరిలోవలో మంగళవారం ఉదయం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాప్తి, నియంత్రణ, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాలతో జోనల్ మలేరియా ఇన్‌స్పెక్టర్ మంగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో యూపీహెచ్‌సీ బాలాజీనగర్ వైద్యాధికారి డాక్టర్ లలిత, హెల్త్ అసిస్టెంట్ దుర్గారావు, సత్యనారాయణ, ఆశ వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

18వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: జిల్లా మలేరియా విభాగం, జీవీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని 18వ వార్డులో మంగళవారం ఉదయం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ దోమలు పెరిగే ప్రదేశాలు, జ్వరాల బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. డెంగ్యూ దోమలు మంచినీటిలోనే పెరుగుతాయని అధికారులు తెలిపారు. ఇంట్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం డ్రైడే పాటించడం ద్వారా దోమల పెరుగుదలను అడ్డుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గొలగాని మంగవేణి, జోన్–3 ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, బర్రెకుమార్, హెల్త్ అసిస్టెంట్‌లు వేణు, రాజేష్, కోదండ, శివ, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత కాల వ్యవధిలో భూసర్వే పూర్తి చేయాలి



అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట : భూ సర్వే పనులు నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్లను జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. మీసేవ, ఏపీ సేవ, స్పందన ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలన్నారు. ఏపీఐఐసీ, ఎన్‌హెచ్–16, రైల్వే భూములకు సంబంధించి మ్యుటేషన్ పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు.

ఈనెల 26 నుంచి మే 25 వరకు నెల రోజుల పాటు మండల తహసీల్దార్ కార్యాలయంలో సింగిల్ విండో సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు భూపట్టాలకు సంబంధించి సవరణలు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో శ్రీనివాస మూర్తి, భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే విజయ్‌కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు, ఎస్‌డీసీలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ కళాశాలల్లో ముందస్తు ప్రవేశాలపై చర్యలు'



ఆర్ఐవోకు వినతి పత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

మద్దిలపాలెం: నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రవేశాలు చేపడుతున్న ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు పిఠాపురం కాలనీలోని ఆర్ఐవో ఉమారాణిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయలు ప్రవేశాల రుసుం రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు పూర్తయిన తర్వాత వేసవి సెలవులు ఇవ్వకుండా ద్వితీయ సంవత్సరం తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కార్పొరేట్ కళాశాలలపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీను, నాయకులు ఆదారి మనోహర్, బోర కిరణ్ పాల్గొన్నారు.

డ్రా ప్రకారమే స్టాళ్ల కేటాయింపు



ఎంవీపీ రైతుబజార్‌లో స్టాళ్లు పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్

ఆరిలోవ: రైతుబజార్లలో ప్రతి వారం తీస్తున్న డ్రాలో వచ్చిన నంబర్ల ప్రకారమే రైతులు, డ్వాక్రా మహిళలు స్టాళ్లు నిర్వహించాలని మార్కెటింగ్ శాఖ ఏడీ షేక్ యాసిన్ తెలిపారు. ఎంవీపీ రైతుబజార్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఇక్కడ స్టాళ్లను పరిశీలించారు. తమకు కేటాయించిన నంబరు గల స్టాళ్లలో వారే ఉన్నారా? వేరెవరైనా ఉన్నారా? అన్న దానిపై ఆయన ఆరా తీశారు. అనంతరం ఆయన డ్రా తీసి, స్టాళ్ల కేటాయింపులు చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ప్రతి వారం నిర్వహించే డ్రా ప్రకారమే స్టాళ్లు నిర్వహించాలన్నారు. ఒకరికి కేటాయించిన స్టాల్లో వేరొకరు వ్యాపారం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడీ దృష్టికి వినియోగదారులు పలు సమస్యలు తీసుకెళ్లారు. సీసీ కెమెరాలు పని చేయడం లేదని, విద్యుత్ దీపాలు వెలగడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ ఈవో జి.ప్రసాద్, సిబ్బంది కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ సిబ్బందికి అవగాహన

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) సిబ్బందికి రైల్ క్లబ్‌లో సాఫ్ట్ స్కిల్స్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎథిక్స్ ఎడ్యుకేటర్, సాఫ్ట్ స్కిల్స్ నిపుణుడు డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ మాట్లాడుతూ ఎటువంటి ఒత్తిడి లేకుండా విధులు నిర్వహించడంలో సాఫ్ట్‌స్కిల్స్ ఉపయోగపడతాయన్నారు. ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ చౌక్కా రఘువీర్ మాట్లాడుతూ ఆర్పీఎఫ్ సిబ్బందిలో ఆత్మస్థైర్యం నింపేందుకు, పనితీరు మెరుగుపరిచేందుకు ఇటువంటి సెమినార్లు నిర్వహిస్తున్నామన్నారు.